హైదరాబాద్ వార్త



# ప్రజలకు అంకితం 'బతుకమ్మకుంట'



బతుకమ్మకుంటను ప్రజలకు అంకితం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించిన బతుకమ్మకుంటను ఆదివారం సాయంత్రం సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 7.40కోట్లతో 5 ఎకరాల 15 గుంటల స్థలంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన బతుకమ్మకుంటను ప్రజ లకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అంబంపేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పిసిసి మాజీ అధ్య క్షుడు, మాజీ ఎంపి వి. హనుమంతరావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్, విమలక్క, గంగవ్వ తదితరులు పాల్గొన్నారు. నగర మేయర్ విజయలక్ష్మీ బతుకమ్మకుంటలో మొదటి బతుకమ్మ వేశారు. విమలక్క పాట పాడి అలరించారు. అంతకు ముందు అంబర్‌పేటలో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్‌టీపీ) కేంద్రాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.

# నగరంలో తగ్గిన క్రైమ్ రేట్

## సిపి సివి ఆనంద్

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త**

హైదరాబాద్‌లో క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గిందని నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ అన్నారు. ఆదివారం పోలీసు ఉన్నతాధికారులతో క్రైమ్ రివ్యూ సమీక్షా సమావేశం నిర్వహించారు. నగర సీపీగా రెండోసారి సీవీ ఆనంద్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సెప్టెంబర్ 2024 నుండి ఆగస్టు 2025 వరకు ఈ 12 నెలంలో భారీగా నేరాలు తగ్గినట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పనితీరును క్రైమ్ వింగ్ సమీక్షలో తేలింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమిష్టిగా, సమన్వయంతో కృషి చేయడం వల్లే నగరంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని ప్రశంసించారు. నేరస్థులను గుర్తించడంతో పాటు అరెస్టులు చేయడం, నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలు చేశామని, కోర్టుల్లో తీర్పులు తీసుకురావడం, రౌడీ గ్యాంగ్స్‌ల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ క్రైమ్ వంటి అన్ని విభాగాలలో పోలీస్ బలగాలు సత్వర స్పందనలతో ఇది సాధ్యమైందని సీవీ ఆనంద్ చెప్పారు. హైదరాబాద్ నగరంలో నైట్ పెట్రోలింగ్ దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.. హైదరబాద్ సిటీ పోలీస్ 2.0 పునర్వ్యవస్థీకరణ అనంతరం ప్రస్తుతం 134 పెట్రోలింగ్ కార్లు 222 బ్లూకోల్ట్స్ విధుల్లో ఉన్నాయని.. వీటి వల్ల రాత్రి నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. అన్ని పండుగలను శాంతియుతంగా, ఎంత సున్నితమైన సందర్భాలు ఉన్నా సాఫీగా నిర్వహించడం, ఈ ఏడాది లా అండ్ ఆర్డర్ పరంగా విజయవంతమైన సంవత్సరంగా చెప్పవచ్చని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది క్రైమ్ రేట్‌లో స్పష్టమైన తగ్గుదల కనిపించిందని, ఇది పోలీసుల నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. "హైదరాబాద్ సిటీ పోలీసులందరూ ఒక టీమ్‌వర్క్‌గా పనిచేసి శాంతి భద్రతలను కాపాడటంలో అద్భుతమైన ఫలితాలను సాధించారు. దీని ఫలితంగానే నగరంలో పండుగలు, ఊరేగింపులు, సభలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతవాతావరణంలో జరుగుతున్నాయి. ఈ విజయానికి కారణమైన ప్రతి అధికారికి, సిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు. సమిష్టి కృషితో ఏదైనా నిర్వహించగలమని నిరూపించాము. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, హైదరాబాద్‌ను నేర రహిత నగరంగా మార్చాలి" అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు సీపీ విక్రంసింగ్ మాన్, అదనపు సీపీ (క్రైమ్స్) పి.విశ్వ ప్రసాద్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) డి.జోయెల్ డేవిస్, జాయింట్ సీపీ (అడ్మిన్) పరిమళ హనా నూతన్, డీసీపీ (డీడీ)ఎన్.శ్వేత, డీసీపీ (సెంట్రల్ జోన్) కె.శిల్పావల్లి, డీసీపీ (వెస్ట్‌జోన్) ఎస్.ఎం. విజయ్‌కుమార్, డీసీపీ(నార్త్‌జోన్) ఎస్.రష్మి పెరుమాళ్, డీసీపీ(ఈస్ట్ జోన్) బి.బాలస్వామి, డీసీపీ (సౌత్‌జోన్) స్నేహ మెహ్రా, డీసీపీ (స్పెషల్ బ్రాంచ్) కె.అపూర్వరావు, డీసీపీ(ట్రాఫిక్) కె.రాహుల్ హెగ్డే, డీసీపీ (ట్రాఫిక్) ఆర్. వెంకటేశ్వర్లు, డీసీపీ (సైబర్ క్రైమ్) ధారా కవిత, డీసీపీ (ఉమెన్స్ సేఫ్టీ) లావణ్య నాయక్ జాదవ్, డీసీపీ (సౌత్ వెస్ట్‌జోన్) జి.చంద్ర మోహన్, డీసీపీ (సౌత్ ఈస్ట్ జోన్) ఎస్.చైతన్య కుమార్, డీసీపీ (ట్రాఫిక్) ఎస్.శ్రీనివాస్, డీసీపీ (టాస్క్‌ఫోర్స్) వై.వి.ఎస్.సుధీంద్ర, డీసీపీ (ఐటీ సెల్) కె.పుష్ప సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివి ఆనంద్

**క్రైమ్ రివ్యూ**(సెప్టెంబరు 2023-ఆగస్టు 2024 - సెప్టెంబరు 2024-ఆగస్టు 2025)

**భౌతిక దాడులు:** 3,451-2,911 (15.6శాతం తగ్గింది).

**మహిళలపై నేరాలు:** 3,250-2,891 (11.6 శాతం తగ్గింది)

**ఆస్తి నేరాలు:** 5,484-4,082 (26శాతం తగ్గింది)

**రికవరీ రేటు** :54శాతం-55 శాతం (పెరిగింది)

**సైబర్ నేరాలు**: 4,348-3745(14 శాతం తగ్గింది)

**డిటెక్షన్ రేటు:** 40 శాతం-42 శాతం (పెరిగింది)

# గణనీయంగా తగ్గిపోయిన మూసీ వరద

### 33.వేల క్యూసెక్కుల నుంచి 3.వేలకు పడిపోయిన వరద

### - ఊపిరి పీల్చుకుంటున్న పాతబస్తీ ప్రజలు

నార్సింగి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్ సాగర్‌లలో చేరింది. ఈ రెండు జలాశయాలలో నీటి మట్టం అంతకంతకు పెరిగిపోవడంతో జల మండలి అధికారులు గంట గంటకు గేట్లను ఎత్తుతూ పోయారు. శుక్రవారం రాత్రి 8.గంటలకు గండిపేట వద్ద ఉన్న మొత్తం 15.గేట్లను 9.ఫీట్ల మేర, హిమాయత్ సాగర్ వద్ద 11.గేట్లు 6.ఫీట్ల మేర ఎత్తి మొత్తం 33.వేల క్యూసెక్కుల నీటిని మూసీ నదిలోకి వదిలిపెట్టారు. దీంతో మూసీ నది మహోగ్రరూపం దాల్చి, తన పరివాహక ప్రాంతాలలో ఉన్న ఇళ్లు, గుళ్లు, బ్రిడ్జిలు, స్మశాన వాటికలు, దోభీఘాట్‌లు, అన్నదాన సత్రాలు ఇలా అన్నింటిని ముంచెత్తింది. శుక్రవారం రాత్రంతా వరద నీరు ఇళ్లలోకి వచ్చిన వందలాది మంది ప్రజలు జాగారం చేశారు. మంచిరేవుల, బైరాగిగూడ, లంగర్‌హౌస్, కార్వాన్, గిర్కాపల్లి, జియాగూడ, పురాణాపూల్ ప్రాంతాలలోని ప్రజలంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికారు. శుక్రవారం రాత్రి 8.గంటల నుంచి శనివారం ఉదయం 9.గంటల వరకు పరిస్థితి ఇలాగే కొనసాగింది. శనివారం వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు జంట జలాశయాల గేట్లను క్రమంగా మూసివేస్తూ వచ్చారు. ఆదివారం వర్షం కురువకపోవడంతో గండిపేట వద్ద 4.గేట్లను 2.ఫీట్ల మేర ఎత్తి 920.క్యూసెక్కులు, హిమాయత్ సాగర్ వద్ద 2.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి 1981.క్యూసెక్కుల నీటిని మూసీ నదిలోకి వదులుతున్నారు. శుక్రవారం రాత్రి 33.వేల క్యూసెక్కులతో ఉగ్రరూపం దాల్చిన మూసీ నది ఆదివారం కేవలం 3.వేల క్యూసెక్కుల నీటితో పారుతుంది. ఏకంగా 30.వేల క్యూసెక్కుల నీరు తగ్గడంతో సాధారణ స్థితిలోనే మూసీ పారుతుంది. దీంతో పాతబస్తీ ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.




విలువిద్య పోటీలలో కాంస్య పతకం సాధించిన నాదర్‌గుల్ చెందిన డిపిఎస్ స్కూల్ విద్యార్థులు ఆశ్రిత్ కశ్యప్, ధన్వంత్ గణేష్, కె.కరణ్‌లు

### విలువిద్య పోటీలలో తెలంగాణ విద్యార్థులకు కాంస్య పతకం

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** సిబిఎస్ఇ జాతీయ విలువిద్య పోటీలలో తెలంగాణ విద్యార్థులు కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పంజాబ్‌లో జిసిఎం కాన్వెంట్ స్కూల్‌లో జరిగిన సిబిఎస్ఇ జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి నాదర్‌గుల్ చెందిన డిపిఎస్ స్కూల్ విద్యార్థులు ఆశ్రిత్ కశ్యప్, ధన్వంత్ గణేష్, కె.కరణ్‌లు అండర్ 17 బాలుర జట్టు కోచ్ నూతన్ కుమార్ ఆధ్వర్యంలో కాంస్య పతకం గెల్చుకున్నారు. 80 మంది పోటీ పడగా బంగారం పతకం హర్యానాకు, రజత పతకం పంజాబ్‌కు దక్కాయి. తెలంగాణ విద్యార్థులైన ఆశ్రిత్, ధన్వంత్, కరణ్‌ల జాతీయ స్థాయి విజయంపై తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్, నాదర్‌గుల్ పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశాయి. వారి కఠోర సాధన, అంకితభావానికి ఇది నిదర్శనమని పేర్కొంది.

### దుర్గ మాతను దర్శించిన ఎంపి ఈటల

**అల్వాల్, సెప్టెంబరు 28 ప్రభాతవవార్త:** దేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. భక్తులతో పాటుగా రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ ఉద్యోగులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అమ్మవారి మండపాలు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలుతో పాటు అన్నదానాలు జరుగుతున్నాయి. మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ లోతుకుంటలో బాని సంఘం అద్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాత మండపాన్ని సందర్శించడంతో పాటుగా సర్వోజీనీన్ దర్గోత్సవ్‌ను ప్రారంభించారు. మచ్చబొల్లారం గణేష్ ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటైన అమ్మవారి మండపంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలులో పాలు పంచుకున్నారు. దేవుని అల్వాల్‌లోని సురేష్ ఎలక్ట్రికల్ ఆధ్వర్యంలో కొలువు తీరిన మండపాన్ని అల్వాల్ సిఐ ప్రశాంత్‌తో పాటుగా ఇతర సిబ్బంది సందర్శించారు.

# ఎంజిబిఎస్ నుంచి బస్సులు పునఃప్రారంభం

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:**

మూసినదిలో వరద ఉధృతి తగ్గడంతో హైదరాబాద్ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది. శనివారం వరద ముంపుకు గురైన బస్‌స్టేషన్‌లో ఆర్టీసి సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన ఆదివారం ఉదయం నుంచి పేరుకుపోయిన బురదను తొలగించారు. బస్ స్టేషన్‌లో బస్సులు పునః ప్రారంభం కావడంతో మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కళకళాడింది. తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. బస్సు సర్వీసులు ప్రారంభం కావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తంచేశారు. మూసినది వరదల కారణంగా ఎదురైన ఇబ్బందుల నుంచి ప్రయాణికులు, ఆర్‌టిసి అధికారులు, స్టాల్స్ యాజమానులు ఉపశమనం పొందినట్లు వారు తెలిపారు. ఆర్‌టిసి అధికారుల వేగవంతమైన చర్యలు సమర్దవంతమైన ఏర్పాట్లలో ఎంజిబిఎస్ తిరిగి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు సాగించడంతో ప్రస్తుతం బస్ స్టేషన్‌లో సాధారణ వాతావరణ నెలకొంది. మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ నుంచి తెలంగాణ జిల్లాలతో పాటు ఆంధ్ర ప్రాంతాలకు బస్సులు దసర పండుగ నడుపుతున్నట్లు చెప్పారు. దసరా స్పెషల్ బస్సులను అక్కడి ఆయా ప్రాంతాల నుండే ప్రయాణికుల సౌకర్యార్ధం బస్సులను నడుపుతామన్నారు.

**ఎల్‌బినగర్ నుంచి నల్గొండ, ఖమ్మం...**

-దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టాండ్ నుంచి ఎల్‌బినగర్ వద్ద నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మిర్యాలగూడలతోపాటు నడిపిస్తున్నారు.

-గౌలిగూడ(సిబిఎస్)పాతబస్‌స్టేషన్ నుంచి ఆంధ్ర, రాయాలసీమాకు

విజయవాడ, నెల్లూరు, గుంటూర్, విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు,

**-ఉప్పల్ చౌరస్తా నుంచి..**

వరంగల్, హన్మకొండ, యాదగిరి గుట్టలకు బస్సులను నడుపుతున్నారు.

**-పికెట్ నుంచి...**

సికింద్రాబాద్ ఫికెట్ బస్సు డిపో నుంచి కరీంనగర్, నిజామబాద్, అదిలాబాద్, మెదక్‌లకు బస్సులను నడిపిస్తున్నారు.

**ఆరాంఘూర్ చౌరస్తా నుంచి...**

మహబూబ్‌నగర్, కర్నూల్, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాకు బస్సులను నడుపుతున్నారు. వరద ముప్పు తగ్గే వరకు ఆయా ప్రాంతాలనుంచి బస్సులను నడిపించడం జరుగుతుందని ఆర్‌టిసి అధికారులు తెలిపారు.

# చార్జీల షాక్..!

- * ప్రైవేటు బస్సుల్లో రెండింతల చార్జీలు
- * ఆర్టీసి బస్సుల్లో 25 నుంచి 50 శాతం అదనం
- * ప్రత్యేక రైళ్లలో 20శాతం అదనపు బాదుడు
- * సొంతూళ్లకు బారీగా తరలిన నగరవాసులు




జూబ్లీబస్‌స్టేషన్‌లో కిటకిటలాడిన ప్రయాణికులు

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త**

పట్నంనుంచి పల్లెలకు దసరా రద్దీ పోటెత్తింది. నగరవాసులు పెద్దఎత్తున సొంత ఊళ్లకు తరలివెళ్లారు. నాలుగు రోజులుగా వివిధ మార్గాల్లో లక్షలాది మంది పల్లెబాట పట్టారు. బస్సులు, రైళ్లు,, ప్రైవేటు వాహనాలు ప్రయాణికుల రద్దీతో కిక్కిరిశాయి. ఆదివారం సైతం రైళ్లు, బస్సుల్లో రద్దీ కనిపించింది. చాలా మంది సొంత వాహనాల్లో బయలుదేరారు. నాలుగైదు రోజులుగా సుమారు 25 లక్షల మంది వరకు సొంత ఊళ్లకు వెళ్లినట్లు అంచనా సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ప్రతి ఏటా ప్రకటించే ఆర్టీసి ఈసారి దసరా ప్రత్యేక బస్సులపై మాత్రం గుట్టుచప్పుడు కాకుండా అదనపు బాదుడుకు పాల్పడింది. జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు ఖాళీ బస్సులను తరలించాల్సి వస్తుందనే సాకుతో ప్రత్యేక బస్సులపై 25 నుంచి 50 శాతం వరకు అదనపు చార్జీలు విధించింది. నిజామాబాద్, అదిలాబాద్, సత్తుపల్లి, విజయవాడ, విశాఖ, గుంటూరు తదితర ప్రాంతాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు వసూళ్లకు పాల్పడింది. తెలంగాణలోని మిగతా ప్రాంతాలకు నడిపిన ప్రత్యేక బస్సుల్లో 25శాతం చొప్పున అదనంగా విధించారు.

మరోవైపు మహిళా ప్రయాణికుల డిమాండ్ మేరకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో లేకపోవడంతో వారు సైతం చార్జీలు చెల్లించి ప్రయాణం చేయాల్సివచ్చిది. ఈ ఏడాది దసరా సందర్భంగా సుమారు 6 వేలకు పైగా ప్రత్యేక బస్సులను నడిసేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందించింది. డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని వంటి బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. సిటీలో తిరిగే ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రత్యేకం పేరిట జిల్లాలకు నడిపించింది. దీంతో ప్రయాణికులు అన్ని ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు చెల్లించాల్సి వచ్చింది.

**రైళ్లలోనూ అదనమే..**

దసరా, దీపావళి రద్దీని దృష్టిలో ఉంచుకొని అక్టోబర్, నవంబర్ నెలల్లో రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక సర్వీసులను నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. కానీ.. ఈ ప్రత్యేక రైళ్లన్నింటిలో సాధారణ చార్జీలపై 20 శాతం అదనంగా విధించారు. వచ్చే జనవరి నెలాఖరు వరకు రెగ్యులర్ రైళ్లు అందుబాటులో లేవు. అన్నింటిలో వెయిటింగ్ లిస్ట్ వందల్లో ఉంది. కొన్ని రైళ్లలో బుకింగ్ సదుపాయం కూడా నిలిచిపోయింది. దీంతో ప్రత్యేక రైళ్లు అని వార్యంగా మారాయి. తెలంగాణలో అతి పెద్ద పండుగ అయిన దసరా సందర్భం గా వచ్చిన వరుస సెలవులను దృష్టిలో ఉంచుకొని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాళ్లు " పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలివెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రయాణికుల రద్దీ భారీగా ఉంది. రిజర్వేషన్లు లభించని వాళ్లు జనరల్ బోగీల్లో, బయలుదేరారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్ల నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరిన అన్ని అన్ని రైళ్లలో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు.

**ప్రైవేట్ దోపిడీ రెండింతలు..**

మరోవైపు హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ 3 ప్రాంతాలకు నడిచే ప్రైవేట్ బస్సులు దారి దోపిడీకి పాల్పడ్డాయి. సాధారణ రోజుల్లో విధించే చార్జీలను రెండింతలు చేశాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు సాధారణం ఏసీ సీసర్ చార్జీ రూ. 900, కొన్ని 5 బస్సుల్లో రూ.1000 వసూలు చేస్తారు. కానీ పండగ రద్దీ దృష్ట్యా ఏకంగా రూ. 2,500 వరకు పెంచినట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవా డకు రూ.350 నుంచి రూ.600 వరకు పెంచారు. గుంటూరు, ఏలూరు, తిరుపతి, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లోనూ అడ్డగోలు చార్జీలు 3 వసూలు చేశారు. బస్సులు, రైళ్లే కాకుండా ఐ బ్యాక్సీలు, కార్లు, టాటాఏస్లు వంటి ప్రైవేట్ వాహనాల్లో సైతం ఇష్టారాజ్యంగా చార్జీల వసూళ్లకు పాల్పడ్డారు. పండగ సందర్భంగా సొంత ఊరుకు వెళ్లాలని భావించే నగరవాసుల సెంటిమెంట్‌ను సొమ్ము చేసుకున్నారు.

# ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

**అత్తాపూర్ సెప్టెంబరు 28, ప్రభాతవార్త** : రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ రైల్వే స్టేషన్ శ్రీ సాయి మోడల్ స్కూల్ ఆవరణలో ఆజాద్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టీసీ రిటైర్డ్ కంట్రోలర్ ఎద్దుల ప్రభాకర్‌రెడ్డి ముఖ్య వక్త చార్మినార్ బాగ్ బౌద్ధిక్ ప్రముక్ రాచమల్ల నిఖిల్ రాజ్ హాజరై య్యారు. ఎద్దుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 1925 సంవత్సరంలో ప్రారంభమైన ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాలు చేసుకోవడం గర్వంగా ఉందని చెప్పారు. నాగపూర్ లో ప్రారంభమై ఆర్ ఎస్ ఎస్ ఈరోజు దేశ వ్యాప్తంగా విస్తరించడం అనేక మంది స్వయంసేవకులు ప్రాణత్యాగ ఫలితమే అని కొనియాడారు. మన హిందూ ధర్మాన్ని రక్షి ంచడంలో ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు ముందు వరుసలో ఉంటారని దేశానికి ఎటువంటి ఆపద వచ్చిన స్వయం సేవలు రక్షి స్తారని తెలిపారు. అనంతరం వక్త మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవంలో ప్రతి కార్యకర్త ప్రతి హిందువు ఇంటికి వెళ్లి పంచ పరివర్తన్ ముఖ్య ఉద్దేశాని వారికి తెలియజేసి హిందూ శక్తిని ఐక్యతన నిరూపించాలని కులాల ఆధారంగా హిందూ సమాజాన్ని విడదీసే కుట్ర జరుగుతుందని వాటిని అడ్డుకోవాలని కోరారుఈ కార్యక్రమంలో బస్తికి చెందిన స్వయం సేవకులు సుజీవన్ రెడ్డి శ్రీకాంత్ భరత్ ఉదయ్ బాలక్రిష్ణ రెడ్డి అజయ్ రాకేష్ మరియు బస్తి పెద్దలు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ రిటైర్డ్ కంట్రోలర్ ఎద్దుల ప్రభాకర్ రెడ్డి

### బిసిలకు జరుగుతున్న అన్యాయంపై ఎక్కుపెట్టిన శరమే

# హిస్సా ఇజ్జత్ హుకుమత్ పుస్తకం : మాజీ డిజిపి

**హైదరాబాద్ సెప్టెంబరు 28 ప్రభాతవార్త:**

రాష్ట్రంలోను, దేశంలోనూ బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఎక్కుపెట్టిన శరమే హిస్సా ఇజ్జత్ హుకుమత్ పుస్తకమని మాజీ డీజీపీ, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. బీసీ రాజ్యాధికార సిద్ధాంతంపై రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు రాసిన శరమే హిస్సా ఇజ్జత్ హుకుమత్ పుస్తకాన్ని నగరంలోని ద తెలంగాణ ఐఎఎస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్ణ చందర్‌రావు ఆవిష్కరించి ప్రసంగించారు. బీసీలకు ఎలా అన్యాయం జరుగుతోందో ఒకే పుస్తకంలో గ్రంథస్థం చేశారు. ఇంతవరకు ఈ అంశంపై సమగ్రంగా ఒక్క పుస్తకం కూడా రాలేదు. శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలం ముందుమాట రాస్తారు. అందులో ఈ మహాప్రస్థానాన్ని చదివి, తట్టుకోగల చేవ ఉంటే చదవండి అంటారు. ఇప్పుడు ఈ రాష్ట్రంలో ఉన్న ప్రజలు ఈ పుస్తకాన్ని చదివి, తట్టుకోగల చేవ ఉంటే చదవాలి. మిగిలిన వారు అయితే కచ్చితంగా ఈ పుస్తకం చదవాలి. ఒక రాష్ట్రానికి సంబంధించి ఇంత సమగ్రమైన పుస్తకం ఎక్కడా లేదు. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు. సుదీర్ఘకాలం పాటు చిరంజీవి ఐఎఎస్ అధికారిగా ఉండి, సమగ్రంగా అధ్యయనం చేయడం తోపాటు గత ఏడాదిన్నర కాలంగా అన్ని అంశాలనూ చూసి అర్థం చేసుకుని రాసిన పుస్తకమిది. ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలి. మనకు మనం న్యాయం చేసుకోవాలంటే ప్రతి బీసీ చదవాల్సిన పుస్తకమే. ఇది మీ చేతికి వచ్చిందంటే అది ఆషామాషీ విషయం కాదు. ఈ ఒక్క పుస్తకం చదివి, ఇందులో మీకు నచ్చిన అంశంతో మీ ప్రసంగం సిద్ధం చేసుకోండి. న్యాయరంగాన్నే తీసుకుంటే, ఇప్పటివరకు జస్టిస్ ఈశ్వరయ్య ఒక్కరే తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. జస్టిస్ కుమరయ్య ఒక్కరే నైజాం కాలంలో నియమితులై, తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చేశారు. ఆయన తప్ప బీసీలు ఇంకెవ్వరూ లేరు. పాలక కులానికి చెందినవారు ఉన్నత పదవుల్లోకి వెళ్లేలా అవకాశాలుంటాయి. కానీ, ఒక బీసీ చీఫ్ జస్టిస్ అయ్యే అవకాశం లేనే లేదని పాలనా వ్యవస్థ ఇది. రాజ్యాంగంలో అన్నీ ఉన్నా, అమలయ్యేనాటికి మనం చీఫ్ జస్టిస్ కాలేం. న్యాయరంగంలో ఏమైందన్న విషయం తెలియాలంటే ఈ పుస్తకం చదవాలి. బీసీ ఎస్సీ ఎస్టీలు పై స్థాయికి వచ్చే విధంగా ఎంపిక ప్రక్రియ ఎందుకు లేదు? దానికి కారణమేంటి? మనకు వాటా (హిస్సా) లేదు, దానికి కారణమేంటంటే.. హుకుమత్ (అధికారం) లేదు. తెలంగాణ అసెంబ్లీలోని 119 స్థానాల్లో ఎందరు బీసీలు? బీసీ మెజారిటీ ఎమ్మెల్యేలు లేనప్పుడు మనం అనుకున్నది ఎలా జరుగుతోంది? ఈ పుస్తకం మనం చదివితే ఈ దేశానికి పట్టిన రోగం... బీసీలను చిన్నచూపు చూడడమే అని అర్థమవుతుంది. దేశంలో ఉన్న సమస్యలన్నీ పోవాలంటే బీసీలకు అధికారంలో వాళ్ల వాటా దక్కాలి. ఈ పుస్తకం నుంచి మనం ఎంతో నేర్చుకునే అవకాశముంది. మీడియా రంగంలో మన వాటా ఎం? సినిమాల్లో చూసుకుంటే గాయకుల్లో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం స్థాయికి ఒక బీసీ పైకి రాని వ్యవస్థలు ఇక్కడుంటాయి. చంద్రబోస్‌లాంటి బీసీ రచయితను పైకి ఎదగనివ్వని వ్యవస్థలుంటాయి. ఇంతకుముందు హనుమంతరావు మాట్లాడేటప్పుడు.. ఎవరైనా రిటైర్ అయ్యాక మాట్లాడుతున్నారని, ఉద్యోగంలో ఉండగా ఎందుకు మాట్లాడరని అన్నారు. అలా మాట్లాడాలంటే అధికారం మన చేతుల్లో లేదు. ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు మాట్లాడాలంటే వారిపైన ఉండే అధికారులు మాట్లాడనివ్వరు" అని తెలిపారు. పుస్తక రచయిత, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ, "బీసీల ఉద్యమానికి ఒక సైద్ధాంతిక పునాది నిర్మించి, ఇది దేనికోసం నడుస్తోందన్న విషయంలో ఒక స్పష్టత ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ పుస్తకం రాశాను. బీసీలు రాబోయే కాలంలో ఉద్యమించి రాజ్యాధికారాన్ని సాధించుకోవాల్సి ఉంది. పుస్తకంలో ప్రత్యేకంగా ప్రస్తావించిన అంశం ఏమిటంటే, బీసీల పార్టీ వస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. ఇప్పుడున్న ఆధిపత్య కులాల పార్టీలేవీ బీసీలకు న్యాయం చేయవు, చేయలేవు" అని స్పష్టం చేశారు.




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ డీజీపీ పూర్ణచందర్‌రావు

# టిటిడి దేవాలయం అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్ ప్రమాణ స్వీకారం


టిటిడి దేవాలయం అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న నేమూరి శంకర్‌గౌడ్

**సైఫాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం బాలాజీభవన్ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడిగా జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్‌గౌడ్ దేవాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. వేద పండితులు, అర్చకులు, పూజారులు, వేద మంత్రాలు, సన్నాయి మేళాల మధ్య ఆయన ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు శంకర్‌గౌడ్ దంపతులు శ్రీవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేవాయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి అశ్సీసులతో భక్తులు ఏలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపడతానని తెలిపారు. తనకు అధ్యక్ష పదవి అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎఇవో యు. రమేష్, అధికారులు శ్రీనివాస్ మణికంత, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు జీపులో శంకర్‌గౌడ్‌ను పెద్ద ఎత్తున ఊరేగించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు దేవాలయం ఎదుట బాణాసంచా పెద్ద ఎత్తున కాల్చారు. దేవాలయం ప్రధాన ద్వారం ఎదుట కార్యకర్తలు పెద్దఎత్తున బాణాసంచా కాల్చడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంత సేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## ఎల్లలు దాటిన బతుకమ్మ పండుగ : రవీందర్‌ముదిరాజ్

**జీడిమెట్ల, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** తెలంగాణ మహిళలకు అతి పెద్ద పండుగైన బతుకమ్మ పండుగ సంప్రదాయం రాష్ట్రంలోనే కాకుండా ఎల్లలు దాటడం ఎంతో గర్వంగా ఉందని పర్యావరణ పరిరక్షకుడు, సామాజికవేత్త రవీందర్ ముదిరాజ్ అన్నారు. అమెరికాలోని ఆర్కన్ స్టేట్ లిటిల్ రాక్‌లో ఉండే స్థానిక తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ కార్యక్రమంలో రవీందర్‌ముదిరాజ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, భక్తిశ్రద్ధలతో ఆడుతుంటే తెలంగాణ పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా ఉందన్నారు. అనంతరం సపంతి భోజనాలు చేసి సందడి చేశారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు


బోనాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

**నిజాంపేట్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, 30 డివిజన్‌లోని చెర్లయల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీచైతన్య కళాశాల నాన్‌టీచింగ్ ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోధనేతర సిబ్బంది ఇంచార్జి రాయపల్లి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కాలనీలో ఊరేగింపుగా తరలివెల్లి అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏజీఎమ్ హరిబాబు, డీన్. బాలకృష్ణ, ప్రిన్సిపాల్ నర్సింగరావు, కళాశాల సిబ్బంది, జర్నలిస్ట్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు మెరుగుపర్చాలి


అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన బిజెపి నేతలు

**అడ్డగుట్ట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** తుకారాంగేట్‌లోని అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని బిజెపి అడ్డగుట్ట అధ్యక్షురాలు గాజుల సౌందర్య, బిజెవైఎం అధ్యక్షులు గెల్లు ఉదయ్ యాదవ్ డిమాండ్ చేశారు. వారు ఆసుపత్రిని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయివాణి, బిజెపి నాయకులు సాయన్న, చింటూ, శివాజీ, హంసరాజ్ పాల్గొన్నారు.

ఫొటోరైటప్: గండి మైసమ్మ దేవాలయం వద్ద కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ్‌కుమార్ ఏర్పాటుచేసిన అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటగోవిందరావు, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎం.ఎన్.శ్రీనివాసరావు తదితరులు

## కవాడిగూడలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


కవాడిగూడలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**ముషీరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** కవాడిగూడలోని గండి మైసమ్మ దేవాలయం వద్ద కాంగ్రెస్‌పార్టీ నగర ప్రధాన ఎం.విజయ్‌కుమార్ ఏర్పాటుచేసిన అమ్మవారిని ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట గోవిందరావు, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎం.ఎన్.శ్రీనివాసరావులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అన్నపూర్ణాదేవిగా కనకాల కట్టమైసమ్మ

**ముషీరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** లోయర్ ట్యాంక్‌బండ్ పైనున్న కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. దసరా శరన్నవరాత్రులలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలలో భాగంగా ఏడవరోజైన ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

## అమ్మవార్లకు పూజలు చేసిన కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గోల్నాక డివిజన్, జైస్వాల్ గార్డెన్స్‌లోని శ్రీబంగారు మైసమ్మ, దేవి నల్లపోచమ్మ దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్ర ఉత్సవాలు భక్తులకు మేలు జరగాలని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


అమ్మవారి దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే


రజక కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు

## చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

### జక్కుల మహేశ్వర్‌రెడ్డి

**కంటోన్మెంట్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** రజకుల సంక్షేమానికి బిఆర్ఎస్ పార్టీ అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లి చిన్నతోకట్టలో ఏర్పాటు చేసిన రజక కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెఎంఆర్.మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో దివంగత ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే సాయన్న రజక కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారు. నిధులు సరిపోకపోవడంతో కమ్యూనిటీ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రజక సంఘం కోర్కె మేరకు రూ.10 లక్షల రూపాయలు తన సొంత నిధులు వెచ్చించి కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేసి ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, ప్యారసాని శ్యామ్, నళిని కిరణ్, అనితాప్రభాకర్, రజక భవన్ దోబిఘాట్ ప్రతినిధులు కె.రమేష్, కమలమ్మ, కె.రాజు, వీరకుమార్, ఎన్.కిషోర్,ఎల్లేశ్, నర్సింగ్, జి.రమేష్, కె.లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఒత్తిడితోనే గుండె సమస్యలు

### ముషీరాబాద్ యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి

**ముషీరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణం మానసిక ఒత్తిడి అని, మానసిక ఒత్తిడిని జయించగలిగితే చాలా వరకు హృదయ సంబంధిత వ్యాధుల నుంచి బయటపడవచ్చునని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 29 ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదలచేస్తూ ప్రస్తుతం గుండె జబ్బులున్నవారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక వ్యాయామం, దురలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా గుండె ఆరోగ్యానికి రాచబాట వేస్తాయని అన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండ వ్యాధులు, దంతవ్యాధులు వంటివి గుండెజబ్బులకు దారితీస్తాయని పేర్కొన్నారు. అస్థిరంగా రొమ్మునొప్పి, రక్తపోటు అధికమవటం, గుండె పనితీరులో వ్యత్యాసం వంటివి గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పిడికెడు గుండె మానవుని జీవితాన్ని నిర్దేసిస్తుందని, అటువంటి గుండె పదిలంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని, పొగాకు, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

## మాతా జాగరణలో పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తా

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దసరా శరన్న నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మాతా జాగరణలో ప్రజాఏక్తా జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త, మా భగవతి జాగరణ్ ఆర్గనైజింగ్ ఠాకూర్ మానీషా, విజయ్‌సింగ్‌చౌహాన్, బజ్జు, నీతుఠాకూర్, పద్మమిశ్రా పాల్గొన్నారు.

## ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**కంటోన్మెంట్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ పరిధిలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి మండపాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. బోర్డువార్డు 2లోని కట్టమీద బస్తీలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్.శ్రీనివాస్, మాజీ బోర్డు సభ్యుడు సదా కేశవ రెడ్డి ఇతరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ టిఎస్‌బిసిఎల్ చైర్మన్ గజ్జెల నాగేష్ నిర్వాహకులుతో కలిసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నరేష్ ముదిరాజ్, దేవులపల్లి శ్రీనివాస్, రావుల సతీష్, శ్రీనివాస్ కిట్టు, గణేష్ పాల్గొన్నారు.


అమ్మవారి సన్నిధిలో మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్.శ్రీనివాస్

## దళిత బహుజనులకు ఐక్యతతోనే రాజ్యాధికారం

**సైఫాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దేశంలోని దళిత బహుజనులంతా ఐక్యంగా రాజకీయ శక్తిగా ఎదిగితేనే రాజ్యాధికారం సిద్ధిస్తుందని, లేకపపోతే బానిసత్వం తప్పదని జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి (ఎన్‌డిఎస్ఎఫ్) జాతీయ జాతీయ ఛైర్మన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిల నాయకత్వంలో పనిచేస్తున్న వివిధ రాజకీయ పార్టీలు ఐక్యతతో పొలిటికల్ పవర్ సాధన కోసం ఉమ్మడిగా మనువాద దోపిడీ పార్టీలపైన రాజకీయ పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఎన్‌డిఎస్ఎఫ్ 5వ వార్షికోత్సవ మహాసభలో ఆయన ప్రసంగించారు. ఈ సభకు హ్యూమన్ రైట్స్ కాన్ఫిడరేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.ఎల్.రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వడ్లమూరి ప్రసంగిస్తూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పరిపాలన కొనసాగుతున్నదని, మనువాదం నుంచి దేశాన్ని, రాష్ట్రాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈవిఎంలను తక్షణమే రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. వచ్చే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గం ఉప ఎన్నికల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డిఎస్ఎఫ్ అభ్యర్థులను భరిలోకి దించుతామన్నారు. మనువాద పార్టీలకు ఎన్‌డి ఎస్ఎఫ్ మూడవ ప్రత్యామ్నాయ కూటమిగా ఎదుగుతున్నదన్నారు. ఈ సభలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు, వివిధ సంఘాల, పార్టీ నేతలు నక్కా దేవేందర్, చిప్పరి సుబ్బారావు, ఎన్.రోజాలీలా, షేక్ భాషా పాల్గొన్నారు.

## షహీద్ భగత్‌సింగ్‌కు ఘన నివాళులు

**బేగంబజార్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** స్వాతంత్ర్యసమర యోధులు షాహిత్‌భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గౌలిగూడ గురుద్వారా వద్ద ఏర్పాటు చేసిన భగతసింగ్ విగ్రహానికి విహెచ్‌పి నాయకులు ఎస్.ఆర్ లక్ష్మన్‌రావుగుప్త పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శివాసేనా ప్రధాన కార్యదర్శి ఎ.సుధర్శన్, ప్రతినిధులు గణేష్, దత్తుపటేల్, దత్తాత్రేయ, మన్నుసింగ్, నన్నుసింగ్, గురుదయాల్‌సింగ్, మహేందగౌడ్, అనిల్‌కుమార్, విజయ్, గోవింద్ సింగ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానవుని జీవితంలో వ్యాయామం భాగం కావాలి

### ఏసిపి ఫయాజ్



లంగర్ హౌస్‌లో 3 కె రన్‌లో పాల్గొన్న ఏసిపి ఫయాజ్

**మెహిదీపట్నం, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** మానవుని నిత్యజీవితంలో వ్యాయామం భాగస్వామ్యం కావాలని, అప్పుడే జీవితం ఆరోగ్యకరంగా ఉంటుందని గోల్కొండ ఏసిపి ఫయాజ్ అన్నారు. ఆదివారం వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని లంగర్ హౌస్ లోని రెనోవా హాస్పిటల్ ఆధ్వర్యంలో 3కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోల్కొండ ఏసిపి ఫయాజ్ హాజరై 3కె రన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపి ఫయాజ్ మాట్లాడుతూ... నేడు మానవుని జీవితం యాంత్రికంగా మారడంతో పాటు నిరంతరం ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఒత్తిడి కారణంగా మానవుని జీవనశైలిలో అనేక మార్పులు వస్తుండడంతో అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవుని జీవితం ఆరోగ్యకరంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరన్నారు. నిత్యం ఒక గంటపాటు వ్యాయామం చేస్తే జీవనశైలిలో మార్పులు తప్పనిసరిగా వస్తాయన్నారు. ఈ ర్యాలీ బాపు ఘాట్ నుంచి లంగర్ హౌస్ దర్గా వరకు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, డాక్టర్ నగేష్, పోలీస్ అకాడమీ రిటైర్డ్ ఏసిపి జగ్గారావు, స్థానిక యువతతో పాటు సీనియర్ సిటిజెన్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కార్వాన్ బ్నాజవాడిలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్థానికులు

# సద్దుల బతుకమ్మ ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ తీసుకోవాలి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**కంటోన్మెంట్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** సద్దుల బత్మకమ ఏర్పాట్లపై వివిధ శాఖ అధికారుల ప్రత్యేక చొరవ తీసుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఈ నెల 30న కర్బలామైదానంలో జరిగే సద్దుల బతుకమ్మ ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. తెలంగాణ సాంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను 9 రోజుల పాటు మహిళలు ఎంతో ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ వేడుకలకు కర్బలా మైదానం పరిసర ప్రాంతాల్లోనే కాకుండా సికింద్రాబాద్‌లోని అన్నిప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వస్తారన్నారు. అందు వల్ల విద్యుత్, డ్రైనేజీలు లీకేజీ కాకుండా, తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కురుమ హేమలత, మాజీ కార్పోరేటర్లు అత్తిలి అరుణగౌడ్, అత్తిలి మల్లికార్జునగౌడ్, డిసి డాకూ నాయక్, మహేష్, బిఆర్ఎస్ నేతలు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, గుర్రం పవన్ కుమార్ గౌడ్, తలసాని స్కైలాబ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


వికలాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ

**సంజీవరెడ్డినగర్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** అమీర్‌పేట నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోది మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వీక్షించారు. అనంతరం ఆయన వికలాంగులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్లను దివ్యాంగులకు మొబైల్ ఫోన్లను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూళ్లలో టాయిలెట్ క్లీనింగ్ మిషన్లను దివ్యాంగులకు అన్ని రకాల పరికరాలను పంపిణీ చేస్తామని చెప్పారు. తాము ఎవరితో కలవం ఒంటరిగానపే మాభవిష్యత్ ప్రయాణం ఉంటుందన్నారు. తమిళనాడులో జరిగిన ఘటన దురదృష్ట కరం అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో బిజెపి డోర్ టు డోర్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాల్సిందే


మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

**సైఫాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్‌లకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 42 శాతం కల్పించాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమం డిమాండ్ చేసింది. 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జివో నెంబరు 9పైన ఓసిలు కోర్టుకు వెళ్ళడం జరిగిందని, దీన్ని అధిగమించాలని, అవసరమైతే గవర్నర్, కే ంద్ర ప్రభుత్వాలను నిలదీయాలని ఆయన సూచించారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం బిసి రిజర్వేషన్‌లను ఒక బూచిగా చూపిస్తూ అసలైన విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్‌లను అమలు చేయకుండా తన పబ్బం గడుపుకోవాలని చూస్తే బిసిలు తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. తమిళనాడు తరహాలో బిసిలకు చట్టబద్ధమైన రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసిల 42 శాతం రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రాన్ని, రాజ్యాంగ వ్యవస్థలపై మరింత ఒత్తిడీ తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ప్రొసిజర్ మిస్టేక్ తదితర కారణాలతో జివో 9ను కోర్టులు కొట్టివేసే దుస్థితికి తీసుకురావద్దని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నాగుల శ్రీనివాస్ యాదవ్, జక్కుల వంశీకృష్ణ, అరుణ్‌యాదవ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## కౌశికిదేవి అవతారంలోదర్శనమిచ్చిన అమ్మవారు

**నిజాంపేట్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** విజయదశమి మహోత్సవంలో భాగంగా ఏడవరోజు నిజాంపేట్‌లో వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారు భక్తులకు కౌశికదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు శ్రీ కౌశికి దేవి పాసుపతం హోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ హోమంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి, లీడర్ కొలన్ నరసింహారెడ్డి వారి ధర్మపత్ని పద్మమ్మలు పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కౌశికి దేవి అమ్మవారు అనుగ్రహంతో రోగ రుగ్మతలు, ఈతి బాధలు నివారణ తొలగునని, కోరిన కోరికలు తీర్చి అన్నిటా జయమును కలగజేయునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలన్ భద్ర రెడ్డి, బొర్రా అశోక్, కడియాల ఇందిరా, జగన్ యాదవ్, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, కొలన్ లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నిజాంపేట్ గ్రామ పెద్దలు గ్రామస్తులు భక్తులు భారీగా పాల్గొన్నారు.

## ఘనంగా మహా చండీహోమం.. అన్నదానం

**అత్తాపూర్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్‌లో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన అమ్మవారు మహా చండీ అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చింది. వేద పండితులు ఆధ్వర్యంలో చండీహోమం ఘనంగా జరిగింది. గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తశతి పారాయణలు, మూలమంత్రజపాలు పఠించారు. పవిత్ర హోమగుండంలో పలువురు దంపతుల చేత సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూల లావణ్య, వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పూల అనసూజ, సతయ్య జ్ఞాపకార్థంగా అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొని అన్నప్రాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నదాన ప్రభువు పూల వెంకటేష్ కుటుంబం సభ్యులను బస్తిపెద్దలు మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్, కుమార్‌యాదవ్, రాజు, కరుణాకర్‌గౌడ్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## న్యూక్లబ్‌ను ఫ్రీ హోల్డ్ చేసేందుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్ ,సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని న్యూక్లబ్‌ను ఫ్రీ హోల్డ్ చేయాలని క్లబ్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డబ్ల్యు ప్రశాంత్, మాజీ అధ్యక్షులు నోముల ప్రకాశ్‌లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేశారు. 80 సంవత్సరాల క్రితం ప్రభుత్వం నుంచి లీజ్ రూపంలో తీసుకోవడం జరిగిందని ఆయన దృష్టికి తెచ్చారు. న్యూ క్లబ్‌ను ప్రభుత్వం లీజ్‌ను రద్దు చేసి ఫ్రీ హోల్డ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల దృష్టికి తెచ్చి క్లబ్ ఫ్రీ హోల్డ్ అయ్యే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తరుణ్,కమిటీ సభ్యులు రాజశేఖర్, విజయ భాస్కర్,ప్రియాంక, కరన్,సుజయ్, విజయ మోహన్ సుంకీ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

**సికింద్రాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** నవరాత్రి ఉత్సవల్లో భాగంగా ఆదివారం మాజీ మంత్రివర్యులు శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ మధుర నగర్ కాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌ను గజ మాలతో సత్కరించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్, అధ్యక్షులు మామిడి బాలిరెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**బన్సీలాల్‌పేట్‌లో...**

బన్సీలాల్‌పేటలోని జబ్బార్ కాంప్లెక్స్ వద్ద గల ఆటోస్టాండ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని ఎమ్మెల్యే తలసానిశ్రీనివాస్‌యాదవ్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం మెట్లబావి సమీపంలో గల ఎర్ర పోచమ్మ ఆలయాన్ని, బండ మైసమ్మ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలోగల అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

**సీతాఫల్‌మండిలో...**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతాఫలమండీ లోని కనకదుర్గ సమేత ఉప్పలమ్మ దేవాలయంలో ఆదివారం చండీ హోమం జరిగింది. ఆలయాన్ని సందర్శించిన సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ పూజలు నిర్వహించారు., చండీహోమంలో నిర్వహించిన పూర్ణాహుతిలో పాల్గొన్నారు. లోక కళ్యాణార్థం నిర్వహించిన ఈ చండీ హోమం లో పాల్గొనడం ఆనందకరమని పద్మారావుగౌడ్ పేర్కొన్నారు.

**మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో...**

**మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతికాలనీ, పద్మశాలిపురం, బుద్వేల్‌తో పాటు పలు కాలనీలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఉత్సవాలలో పాల్గొని దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యూత్ అసోసియేషన్ పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలి

**బిజెపి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్**

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబరు 28, ప్రభాతవార్త** ప్రధాని నరేంద్ర మోడీ మన్‌కి బాత్ 126 ఎపిసోడ్ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానంద నగర్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు పాల్గొని లక్ష్మణ్‌ని కలిసి మన్‌కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ రోజు దేశ ప్రజలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ఆత్మీయంగా సంభాషించారనీ ఈ సందర్భంగా ఆయన దేశ అభివృద్ధి, సాంకేతిక ప్రగతి, యువత పాత్ర, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ భారత్ కార్యక్రమం, మహిళా సాధికారతవంటి పలు కీలక అంశాలపై తన ఆలోచనలు పంచుకున్నారు. ప్రధాని సాధారణ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, సూచనలు తెలుసుకుంటూ, స్ఫూర్తిదాయక కథనాలను పంచుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అన్నారు. ప్రతి పౌరుడు దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మన్ కీ బాత్ ద్వారా ప్రధాని దేశ యువతకు, రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, శాస్త్రవేత్తలకు, వ్యాపారవేత్తలకు, కార్మికులకు ప్రోత్సాహం అందజేస్తూ, భారత దేశాన్ని ప్రపంచంలో అగ్రగామి దేశంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మన్ కీ బాత్ కార్యక్రమం ప్రజలలో దేశభక్తి, సేవా భావం,సామాజిక బాధ్యతా స్ఫూర్తిని పెంపొందించే వేదికగా నిలుస్తోందనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు, కాలనీ వాసులు, సంఘాల నాయకులు, పాల్గొన్నారు.


మంత్రి జూపల్లి నుంచి అవార్డు అందుకుంటున్న వైల్డ్‌వాటర్ ప్రతినిధులు

## వైల్డ్ వాటర్ అమ్యూజ్‌మెంట్ థీం పార్క్‌కు బెస్ట్ థీం పార్క్ అవార్డు

**మెహిదీపట్నం, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యం అని వైల్డ్ వాటర్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ థీమ్ పార్క్ సంస్థ జిఎం కుమార వేలం పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని వైల్డ్ వాటర్ అమ్యూజ్మెంట్ థీమ్ పార్క్ కు బెస్ట్ థీం పార్క్ అవార్డు దక్కింది. ఈ అవార్డును శనివారం శిల్పారామం లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా వైల్డ్ వాటర్ సంస్థ ప్రతినిధులు కుమార వేలం, సోవాన మహాపాత్ర, సాయికిరణ్‌రాజ్ యాదవులు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ పిల్లలతోపాటు పెద్దలు అమ్యూజ్మెంట్ పార్కులో ఎంతో ఉల్లాసాని పొందుతారు అన్నారు. ప్రతి మనిషి తన నిత్యజీవితంలో ఎన్నో ఒత్తిడిలకు గురవుతారని తమ థీం పార్కును సందర్శించడంతో ఒత్తిడి తగ్గి నూతన ఉత్సాహంతో ముందుకు సాగుతారని అన్నారు. తాము వినియోగదారులకు అందిస్తున్న సేవలకు గాను ప్రభుత్వం తమ సంస్థను గుర్తించి బెస్ట్ థీం పార్క్ అవార్డును అందించడం తమకు చాలా సంతోషంగా, గర్వంగా ఉందని ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ నటుడు పైడి జయరాజ్ : నరసింహారెడ్డి


మాట్లాడుతున్న భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి

**రవీంద్రభారతి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** అంతర్జాతీయంగా గొప్ప నటుడుగా పేరుప్రఖ్యాతులు సంపాదించిన పైడి జయరాజ్ తమ తెలంగాణ బిడ్డ కావడం యావత్ తెలుగుజాతికే గర్వకారణమని రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఎ.నరసింహారెడ్డి అన్నారు. పైడి జయరాజ్ 116వ జయంతిని పురస్కరించుకొని రవీంద్రభారతిలోని ప్రివ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహారెడ్డి జయరాజ్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రకాసనంచేసి ఘననివాళులు అర్పించారు. జయరాజ్ తెలుగు సినిమాలో కాకపోయినా హిందీ సినియాలు, అంతర్జాతీయంగా అమెరికా సినిమా పరిశ్రమలో గొప్ప నటుడుగా మంచి పేరు సంపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల రవీందర్, శ్రీనివాస్, మల్లం రమేష్, సుధీర్, డా. విజయ్‌కుమార్, పి.నర్సింలు, ఆకుల రవి, కాసారం రమేష్, జయరాజ్ కుటుంబసభ్యులు పెద్దసంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## ప్రేమతో... నాన్న పుస్తకావిష్కరణ

**రవీంద్రభారతి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** ఈ సృష్టిలో పిల్లలపట్ల తల్లిదండ్రుల ఆప్యాయతలు, తండ్రికి కూతురు మీదుంటే అత్యంత ప్రేమ, మమతానుబంధాలు వెలకట్టలేనివని దానికి నిదర్శనమే జాలాది రత్న సుధీర్ రచించిన కుమార్తెకు ప్రేమతో..నాన్న పుస్తకమని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన సభలో డా. ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కకర్తగా పాల్గొని ముఖ్యఅతిథి ఎ.దినకర్‌బాబు, గౌరవ అతిథులు గార్లపాటి పల్లవి, దేవనపల్లి వీణావాణి, సి.ఎస్.రాంబాబు, రచయిత జాలాది రత్నసుధీర్, సభా నిర్వాహకుడు దిలీప్‌తో కలిసి కుమార్తెకు ప్రేమతో...నాన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇతర అతిథులు ప్రసంగిస్తూ తండ్రి కుమార్తెల విడదీయరాని అనుబంధాలను సవివరపరిచారు.

## అమ్మవారికి పూజలు చేసిన బండి రమేష్


అమ్మవారి పూజల్లో పాల్గొన్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో కృష్ణ రాజ్‌పుత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని టిపిసిసి ఉపాధ్యక్షుడు జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆదివారం సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మదర్శనం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** బాపూనగర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అమ్మవారి దేవి శరన్నతరాత్రోత్స వాల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వేదపండితులు శివశ్రీ ఆనంద్‌స్వామి మంత్రోచ్చారణల మధ్య ఆలయంలో లలితాసహస్రనామపారాయణాలను, కుంకుమార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో 28న వారాహిదేవి అలంకారం ఉంటుందని ఆలయం కమిటీ నిర్వాహకులు వివరించారు.

## డిఎస్‌పి పోస్టుకు ఎంపికైన డిఎస్‌ఐ కుమారుడు

**- శుభాకాంక్షలు తెలిపిన ఏసీపీ,ఇన్‌స్పెక్టర్, తోటి ఎస్‌ఐలు**

**నార్సింగి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** పుత్రోత్సహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడు పుట్టదు, జనులా పుత్రుని కనుగొని పొగడగ పుత్రోత్సహంబు నాడు పొందుర సుమతీ... ఈ పద్యం నార్సింగి డిఎస్‌ఐ వీరేశంకు అతికనట్లు సరిపోతుంది. తాను కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ తన కుమారుడు సాయి విశ్వంత్‌ను క్రమశిక్షణతో పెంచి, ఉన్నత చదువులు చదివించాడు. చిన్నతనం నుంచి తండ్రి వీరేశం పని చేసే పోలీసు శాఖలో పెద్ద ఉద్యోగం సాధించాలని విశ్వంత్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆ దిశగా విశ్వంత్ పట్టుదలతో చదువుకొని గ్రూప్-1 పరీక్షను రాశాడు. గత రెండు రోజుల క్రితం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాలలో సాయి విశ్వంత్ డిఎస్‌పి పోస్టుకు ఎంపికయ్యాడు. దీంతో తండ్రి, కొడుకులు ఇద్దరూ పోలీసు శాఖలోనే ఉద్యోగాలు పొందారు. తండ్రి ఎస్.ఐగా పని చేస్తుండగా కొడుకు డిఎస్‌పిగా ఎంపికవ్వడం గర్వకారణం. తన కుమారుడు సాధించిన ఈ ఘనత పట్ల ఎస్.ఐ వీరేశం ఆనందపరవశులవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నార్సింగి ఏసీపీ రమణాగౌడ్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, ఎస్.ఐలు శ్రీశైలంగౌడ్, మునీందర్, మురళీ, సుఖేందర్‌రెడ్డి, మల్లేష్‌లు, సిబ్బంది అందరూ డిఎస్‌ఐ వీరేశంకు శుభాకాంక్షలు తెలిపారు.


తల్లిదండ్రులతో తెలంగాణ గ్రూప్-1 ఫలితాలలో డిఎస్‌పి పోస్టుకు ఎంపికైన సాయి విశ్వంత్


అమ్మవారిని దర్శించుకున్న సత్యం శ్రీరంగం

## భక్తితో అమ్మవారిని సేవిస్తే కష్టాలు తొలిగిపోతాయి

**టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** దేవి కటాక్షంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం బాలానగర్ డివిజన్‌లోని పలు ఉత్సవ కమిటీల ఆహ్వానాల మేరకు మండపాలలో ఏర్పాటుచేసిన దుర్గమాత అమ్మవారిని డా. సత్యం శ్రీరంగం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం నిర్వాపకులు ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని సత్యం శ్రీరంగం చేతుల మీదుగా ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ దసరా నవరాత్రుల సందర్భంగా ప్రజలు ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాలను శ్రద్ధగా నిర్వహిస్తున్న తీరును అభినందించారు.కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పుష్పారెడ్డి, శితల్ రాజ్ పురోహిత్, మహేందర్, హేమంత్, శేఖర్ గజానంద్, అనీష్ రెడ్డి, శంకర్, శామ్యూల్, రాఖీ, కృపాకర్, సరోజ, ఎడ్ల రమేష్, ఎడ్ల మనోజ్, అనిల్, భాస్కర్, ప్రశాంత్, లడ్డు, కిషోర్, రాజేష్, అనురాధ, శిరీష, మౌనిక పాల్గొన్నారు.

**పాకిస్తాన్‌తో భారత్‌ను క్రికెట్ మ్యాచ్‌కు**

## అనుమతించడం ప్రజలను అవమానించడమే

**-ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వినర్ డాక్టర్ డిద్ది సుధాకర్**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ప్రధాని మోదీ పాకిస్తాన్ తో భారత్ క్రికెట్ మ్యాచ్ ను అనుమతించడం దేశ ప్రజలను అవమానించిందామే అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వినర్ డాక్టర్ డిద్ది సుధాకర్ మండిపడ్డారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద పాకిస్తాన్ తో భారత్ క్రికెట్ మ్యాచ్ ను కేంద్ర ప్రభుత్వం అనుమతించడాన్ని నిరసిస్తూ ఆప్ ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మన దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సాహస్తున్న పాకిస్తాన్ ను ప్రధాని మోదీ ఎందుకు వెనుకేసూ్త వస్తున్నాడని ప్రశ్నించారు. భారత్ పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ లను నిషేదించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో అప్ రాష్ట్ర నేతలు ఎండి మజీద్. యెహాసన్. శబాజ్. అజీమ్ బేగ్. రాకేష్ రెడ్డి. రాకేష్ సింగ్. జావీద్ షరీఫ్. మోనిక. లియకత్ పాల్గొన్నారు.

## జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు సత్కారం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్‌కోర్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రఘురామ్‌రెడ్డి, ఎం.మధుసూదన్ ఆధ్వర్యంలో ఆదివారం జస్టిస్ జి.ప్రవీణ్‌కుమార్ అదనపు జడ్జ్‌గా నియమితులైన సందర్భంగా ఘనంగా సత్కరించే కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ హాజరై సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పారిశ్రామిక ట్రైబ్యునల్ చైర్మన్ కోకా రాధాదేవి, కోర్టు ప్రీసైడింగ్ ఆఫీసర్ ఎస్.ప్రేమావతి, జిల్లా కన్స్యూమర్ కమిషన్ అధ్యక్షుడు జి.రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మరింత ఉన్నత ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.విలాస్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ వి.తిరుపతిరెడ్డి, సీనియర్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవి నవరాత్రోత్సవ వేడుకలు

**ఫిల్మ్‌నగర్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** దేవి నవరాత్రుల ఉత్సవా ల్లో జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పాల్గొన్నారు. డివిజన్‌లోని ఫిల్మ్‌నగర్, ఇందిరానగర్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

## బీజేఆర్‌నగర్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఫిల్మ్‌నగర్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** ఫిల్మ్‌నగర్‌లోని బీజేఆర్‌నగర్‌లో రాణిరుద్రమ మహిళా శక్తి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బస్తీలోని మహిళలంతా ఒకచోటికి చేరి ఇక్కడ బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావుతోపాటు రాణిరుద్రమ మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు రాములమ్మ, బస్తీ యువత అధ్యక్షుడు యాది, దామోదర్, యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన దుర్గామాతను సైతం మామిడి నర్సింగ్‌రావు దర్శించుకున్నారు.

## భక్తిభరితం.. శ్రీవారి ఎదుర్కోళ్ల ఉత్సవం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** ఒకవైపు సేవలు.. మరోవైపు ఉత్సవ సంబరంతో శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కన్నులపండుగగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామివారి విగ్రహంతో సర్వభూపాల వాహన సేవ నిర్వహించారు. ఈ ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి సేవలో మంత్రముగ్ధులయ్యారు. రాత్రి 7 గంలకు స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. స్వామివారిని ఆలయ పరిసరాల్లో ఊరేగిస్తూ అంగరంగ వైభవంగా ఈ వేడుకలను నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఎదురుకోళ్ల సేవను కొనసాగించారు. గోవిందా.. గోవిందా అనే భక్తి నామాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు స్వామివారి తిరుక్కళ్యాణమహోత్సవం, రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవను నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ సిపిరి అర్జున్‌యాదవ్ తెలిపారు.



హైదర్షాకోట్‌లో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయిస్తున్న రాజేందర్‌రెడ్డి

## బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు పరిశీలన

**నార్సింగి, సెప్టంబరు 28 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న బతుకమ్మ నిమజ్జనంకు ఉపయోగించే బావిని శుభ్రం చేయించారు. రంగుల అద్దకం, నీటిని నింపడం వంటి పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్షాకోట్‌లో ప్రతీ ఏటా తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ సంబురాలను మహిళలు ఘనంగా నిర్వహిస్తారని, ఈ సంవత్సరం కూడా బతుకమ్మ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయిస్తున్నామని వివరించారు. నీటిని నింపడం, భారీ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు టింకురెడ్డి, సంతోష్ ముదిరాజ్, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు

**నిజాంపేట్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** ఈ దేశం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో ప్రపంచంలోనే సర్వోన్నతంగా ఎదిగిన నాడు ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం పూర్తవుతుందని అప్పాల ప్రసాద్ జీ అన్నారు. ఆదివారం ప్రగతినగర్ ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టాభి రామాంజనేయ దేవస్థానంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ సామాజిక సమరసత సంయోజక్, అఖిలభారత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ జీ, డా. మేజర్ నిఖిలేశ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ఏర్పడిన ఈ వంద సంవత్సరాలలో దేశం కోసం ఏమేమి చేశాము, ఇక ముందు ఏమేమి చేయాలి అన్నది చర్చించుకోవడానికే ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. ముస్లిమ్ దురాక్రమణదారుల దాడులు, దండయాత్రల కారణంగా ప్రపంచంలోని ఎన్నో దేశాల నాగరికతలు, ఘన సంస్కృతులు, ఆచార సంప్రదాయాలు పూర్తిగా ఎలాతుడిచిపెట్టుకు పోయాయో వివరించారు. కానీ ఎన్నో దుష్టుల దాడులను తట్టుకొని మన దేశం, మన సంస్కృతి బలంగా నిలిచి దినదినప్రవృద్ధమానమవుతున్నదంటే, దానికి కారణం బలమైన వసుధైక కుటుంబ భావనతో కూడిన మన కుటుంబ వ్యవస్థేనన్నారు. అటువంటి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత, మన పిల్లలకు చదువు, సంపాదన మాత్రమే కాకుండా సంస్కారం, విలువలు నేర్పించాలని బోధించారు. సంఘ స్వయం సేవకులు దేశం కోసం నిస్వార్థంగా పని చేస్తూ దేశాన్ని 2047నాటికి ప్రపంచంలో నెంబర్ ఒన్ స్థానానికి తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ గణవేషధారి స్వయం సేవకులతో పాటు పుర ప్రముఖులు, మహిళలు పెద్దఎత్తు నపాల్గొన్నారు.

## స్కందమాత దేవిగా దర్శనమిచ్చిన పెద్దమ్మతల్లి

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి స్కందమాతదేవిగా దర్శనమిచ్చింది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లిని ఆదివారం స్కందమాత దేవిగా అలంకరించారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయం బయటి వరకు భక్తులు క్యూలైన్లు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పెద్దఎత్తున తరలివచ్చిన వాహనాలతో చుట్టుపక్కల ఉన్న రహదారులతోపాటు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి అభిషేకంతోపాటు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.పారాయణాలు, మహానివేదన,ప్రదోషకాల పూజతోపాటు రాత్రి 8 గంటలకు పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తికి పల్లకిసేవ, పవళింపు సేవ నిర్వహించారు.

## కాత్యాయనీ దేవిగా దర్శనమిస్తున్న మహంకాళి అమ్మవారు

**ముషీరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అంబర్‌పేట్ మహంకాళి అమ్మవారు ఆదివారం కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కార్పోరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పోరేటర్‌లు జ్ఞానేశ్వర్ గౌడ్, పద్మవతి డిఎరెడ్డి, నారాయణస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అమ్మవారి దయతో ప్రజలు సుఖంగా జీవించాలి

**ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కొంపల్లి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి అపర్ణ పామ్ గ్రో నందు ఏర్పాటుచేసిన దుర్గామాత నవరాత్రి వేడుకలకు బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తికి రూపం అమ్మవారి స్వరూపమని, అమ్మ దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కౌన్సిలర్ పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు ఎండీ.ఖాదర్ (షన్ను భాయ్), భూలక్ష్మణ్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# బిసి 'ఎ'లోని కులాలకు 12 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.భాగయ్య

**సైఫాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు స్థానిక సంస్థల కోసం కల్పించిన 42శాతం రిజర్వేషన్‌లలో బిసి ఎ కూలా లకు జనాభా ప్రాతిపదిన వాటా కల్పించాలని తెలం గాణ బిసి ఎ హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరి రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. భాగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ నరహరి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి వెనుకబడిన కులాల్లో కేవలం 5 కులాలు మాత్రమే రిజర్వేషన్‌లు పొందుతున్నాయని, కాని బిసి ఎలోని 73 కులాలకు రిజర్వేషన్ లలో అన్యాయం జరుగుతున్నదని, ముఖ్యంగా విద్యా, ఉద్యోగ రంగాలలో తీవ్రంగా అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన జాబితాను బహిర్గతంచేసి కులాల వారీగా రిజర్వేషన్‌లు కల్పించా లని డిమాండ్‌చేశారు.ముఖ్యంగా బిసి ఎలోని కొంత మంది నాయకులు వారి, వారి స్వయం ప్రతిపత్తితోనే చట్టసభలకు వెళ్లారని, మిగిలిన కులాలకు ఏలాంటి రాజకీయ ప్రయోజనం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 73 బిసి ఎ కులాలకు 12 శాతం రిజ ర్వేషన్‌లు కల్పించాలని కోరారు. బిసి ఎ జాబితా లోకి ఇతర స్థానిక, స్థానికేతర కులాలను చేర్చరా దని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు గడప శ్రీహరి, రామానందస్వామి, కంటె రాంచందర్, అంబటి సుధాకర్ పాల్గొన్నారు.


రైల్వే సీసీఎస్ బోర్డు పాలక మండలి సమావేశంలో ప్రెసిడెంట్ చిలుక స్వామి, రాంమోహన్ తదితరులు

## రైల్వే సిసిఎస్‌లో ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు

**చిలుక స్వామి**

**కంటోన్మెంట్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే సీసీఎస్ సభ్యులకు అన్ని విధాలా బెనిఫిట్స్ అందిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చిలుక స్వామి తెలిపారు. శనివారం మేనేజ్ మెంట్ బోర్డు సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. ప్రమాద బీమా రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుటకు బోర్డు ఆమోదం తెలిపింది. 20206 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది, ఉద్యోగి మరణిస్తే అంత్య క్రియల నిమిత్త ఖర్చులు రూ.10 వేల నుంచి రూ. 15 వేలకు పెంచారు. 2024 . .25 ఆర్థిక సంవత్సరానికి గాను డివిడెండ్ గరిష్టంగా 18 శాతం దీపావళి కానుక అందించుటకు బోర్డు ఆమోదం తెలిపింది. ఉన్నత విద్య కోసం ఎడ్యుకేషన్ లోన్ రూ.2 లక్షల పెంపు విషయమై పరిశీలనలో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఉపాధ్యక్షులు ఆర్.రాంమోహన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి


హరీష్‌రావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాధాకృష్ణ,విజయ్‌కుమార్

**నానాచారం, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ఆరునెలలగా పెండింగ్‌లో ఉన్న గురుకులాలా పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆదివారం మాజీ మంత్రి హరీష్‌రావుకు గురుకుల కాంట్రాక్టర్ జేఏసీ అధ్యక్షులు నల్లారాధా కృష్ణ, రాష్ట్ర కన్వీనగర్ కనుకుంట్ల విజయ్ కుమార్ బృందం వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిదంగా గురుకులాల గురుకులా డైట్ బిల్లులను కూడా ఇవ్వడంలేదని ఆయనకు వివరించారు. గత ప్రభుత్వ హాయాంలో రెండు లేదా మూడు నెలలకు ఒకసారి బిల్లులు చెల్లించేవారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం సుమారు రూ. 1000 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. దసరా పండుగ కూడ జరుపుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంలో ఆర్థిక మంత్రి, సాంఘీక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి నిధులు చెల్లించేలా చూడాలని హరీష్ రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జేఏసీ రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లారి అశోక్ బాబు, ఎ.హరిబాబు, మాదు పోకల శేఖర్ రెడ్డి, హనుమండ్ల విష్ణు, పరుపని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో వైభవంగా దసరా మహోత్సవాలు

**చార్మినార్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో దసరా సందర్భంగా బెంగాలీలు శ్రీ సర్బోజ్జయినీ దుర్గామాత ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. చార్‌కమాన్ బెంగాలీ సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి చార్మినార్ నుంచి శ్రీ దుర్గామాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఘాన్సీ బజార్ లోని పి.సత్యనారాయణ భవన్‌లో దుర్గామాత విగ్రహాన్ని మండపంలో ప్రతిష్టించారు. వందలాది మంది బెంగాలీలు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. కాగా బెంగాలీలు ఎక్కువగా ఉన్న ఘాన్సీ బజార్,ఘూలా, చార్‌కమాన్, కోకరివాడి, షక్కర్‌కోట ప్రాంతాలలో ఘనంగా పలు బెంగాలీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ సర్బోజ్జయినీ దుర్గామాత ఉత్సవాలు జరుగుతున్నాయి.

## ఘనంగా మహా చండీ యాగాలు

**పేట్ బషీరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ ప్రసూన నగర్ కోదండరామాలయంలో ఆదివారం సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా ఆరు హోమగుండలతో ప్రత్యేకంగా మహా చండీ యాగలు నిర్వహించడం జరిగింది. ఈ పూజలో కాలనీ వాసులు అందరు పాల్గొని ఎంతో భక్తి శ్రద్దాలతో పూజలు చేసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ చండి అవతారం అలాగే ప్రత్యేకంగా జరిగిన మహా చండి యాగల విశిష్టత గురుంచి వివరించారు. ఈ మహా పూజ వేడుకల్లో సంక్షేమ సంఘ నాయకులు ఆలయ కమిటీ నాయకులతో పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, DARURIE JYOTHI W/o Santhosh Kumar, R/o Flat No.316, Anuhar Morning Raga, Road No.26, Alkapur, Township, Puppalaguda, Hyd, Have Changed my name as GOMATAM JYOTHI for all records purpose.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**PUBLIC NOTICE**

The general public is hereby informed that **Mr. R. Karthik,** son of **Mr. R. Shankar and Mrs. Latha,** resident of H.No. 1/66, Puppalaguda, K.V. Ranga Reddy District, Telangana-500089, being a major, has decided to marry/enter into a relationship with **Ms. Golluri Sai Harika, daughter of Mr. Golluri Narsing Rao and Mrs. Golluri Vani,** resident at Anjali Gardens, Manikonda, Hyderabad. Our clients Mr. R. Shankar and Mrs. R. Latha, the parents of Mr. R.Karthik, hereby declare that they have no objection to his personal decision. The said marriage or relationship is entirely his independent choice.

It is further declared by our clients, that any act, omission or consequence arising from the said relationship shall be the sole responsibility of Mr. R. Karthik and Ms. Harika alone. The parents of Mr.R.Karthik and his family members shall not be liable for any false claims, allegations, or disputes in the future.

This notice is issued to safeguard the integrity and reputation of our clients family and to make it clear that no liability shall arise against them in connection with the personal decisions of Mr. R. Karthik.

**Sd/- M/s. Sharad Singh Thakur**
**S. Vijaya Bhaskar Reddy**
**Advocates**
S. M. Associates, Suit No.2, First Floor, Marrichet junction, Beside Domino's, Manikonda, Hyderabad, T.S-89
**Cell: 9533474007**

**IN THE COURT OF THE HON'BLE ADDITIONAL DISTRICT JUDGE, CHEVELLA, R.R. DISTRICT, AT: CHEVELLA**
**GOP. NO. 3 OF 2025**

Between:
**Kyama Shiva Shankar**
For his minor children ...**Petitioner**
AND
**All Concerned** ...**Respondents**
To
**All concerned.**

Whereas the Petitioner **Sri. Kyama Shiva Shankar** has filed the above GOP No.3 of 2025 before the Hon'ble Additional District Judge, Ranga Reddy District, at Chevella, under the provisions of the Hindu Minority and Guardianship Act, 1956, seeking permission of the Court to alienate the land in Sy.Nos.689/ఆ1/2 (Ac.0-08 gts.) and 689/ఆ1/3 (Ac.0-08 gts.), situated at Murthuzguda Village, Moinabad Mandal, Ranga Reddy District, owned by his minor children Kum. Kyama Kavya (aged 17 years) and Mast. Kyama Venkata Krishna (aged 15 years), for their welfare, education, maintenance and benefit.

If any person has any objection to the said petition or to the proposed alienation of the above schedule property, he/she may appear before the Hon'ble Additional District Judge, Ranga Reddy District, at Chevella, on **10.10.2025, at 10:30 a.m.,** failing which the matter will be heard and decided in accordance with law.

**Sd/- B. BAL REDDY**
**Advocate**
Flat No.302, Devi Mid Town Sun City, Bandlaguda Jagir, Ranga Reddy District
**Cell No: 8121007007.**



ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న
బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

**ఆమనగల్లు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌కి గుణపాఠం తప్పదని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలం చెందిందని, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తిరుగుబాటు చేసేందుకు సిద్దంగా ఉన్నారని అర్జున్‌రావు జోస్యం చెప్పారు. ఆమనగల్లు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్‌ఖలీల్, పార్టీ శ్రేణులతో కలిసి అర్జున్‌రావు విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో ప్రజాపాలన గాడితప్పిపోవడంతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు కెసిఆర్ నాయకత్వంలోని రామరాజ్యాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఓటమిని ముందే అంచనా వేసిన రాష్ట్ర సర్కారు ఉద్దేశపూర్వకంగా ఎన్నికల నిర్వహణను హైకోర్టు తీర్పు ఒత్తిడికి గురై ఆదరబాదరకు తెరలేపిందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌కు పట్టం కట్టాలని అర్జున్‌రావు కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు గండికోట శంకర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో శాఖాహార ర్యాలీని నిర్వహిస్తున్న చేవెళ్ల ఏమ్మెల్యే కాలె యాదయ్య

## శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే యాదయ్య

**చేవెళ్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ధాన్యం తప్పని సరిగా చేయాలని చేవెళ్ల ఏమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. రామన్న గూడ మాజీ సర్పంచ్ లావణ్య శంకర్‌లు నిర్వహించిన శాఖహార ర్యాలీని ఆదివారం చేవెళ్ల మండలం కేంద్రంలో చేవెళ్ల ఏమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ ఆరోగ్యంగా అనందంగా జీవించడానికి శాఖహరంతో పాటు ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అకులు అలం తినే జంతువులు కొండలు గుట్టలు ఎక్కుతుంటే మాసం తింటున్న మానవుడు మాత్రం సరిగ్గా నడువలేక పోతున్నాడన్నారు. మనిషి రోజు రోజుకు రోగాలపాలై మంచం ఎక్కుతున్నాడన్నారు. గాంధీ, బుద్ద భగవానుడు, అంబేద్కర్ లాంటి మహశయుల మార్గాన్ని అశయాన్ని బ్రహ్మర్షి పితామహ పత్రీజీ అచరించారన్నారు. సమాజం మార్పుకు శాఖాహార ర్యాలీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలక్రిష్ణా, సదానందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిరమిడ్ సొసైటీ మాస్టర్స్, దామోదర్‌రెడ్డి, బాలక్రిష్ణా, లక్ష్మీ, బంగ్లా అంజనేయరెడ్డి, నవీన్, బాలక్రిష్ణారెడ్డి, చంద్రశేఖర్, రాజశేఖర్, ప్రవీన్, శైలజ, తిరుపతయ్య, లావణ్య, విష్ణు, బాబు, రాజేందర్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస, యాదయ్య తదతరులు పాల్గొన్నారు.



జాషువాకు నివాళులర్పిస్తున్న నాయకులు

## జాషువా జయంతిని అధికారికంగా జరపాలి

**మంచాల సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** ఆరుట్ల గ్రామంలో గుర్రం జాషువ 130వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాషువ రచయితగా గబ్బిలం, కవి కోకిల, నవయుగ కవిగా, విశ్వ కవిగా, చక్రవర్తిగా, రచనలు, బిరుదులు, ఉపాధ్యాయుడిగా, తన రచనలు అభ్యుదయ భావాలు కలిగిన సాంప్రదాయ కవిగా, వేదన భరిత అనుభవంతో జీవిత అనుభవంతో మానవ జీవితాన్ని వ్యాఖ్యానించిన కవి జాషువా జీవితం నుండి ఒక ఎమ్మెల్సీగా చట్టసభలో ఎన్నో అనుభవాలను తెలిపిన మహాకవి గుర్రం జాషువ అని అన్నారు. ఇలాంటి మహాకవి దళితుడైనందున ప్రభుత్వం ఆయన జయంతి వేడుకలు అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కంబాలపల్లి భాస్కర్, ప్రజా సంఘాల నాయకుడు, మాజీ ఎం.పి.టి.సి చీరాల రమేష్, మంకు మురళి, మాదుగుల కృష్ణ , గుడ్డు మల్లి చంద్రయ్య, అనంగాల పరమేష్, జానీ పాషా, పున్నం రాము, కోర జంగయ్య, తదితరులు పాల్గొని జాషువా ఘనమైన నివాళులు అర్పించారు.

## ఆమనగల్లులో కెటిఆర్‌కు ఘన స్వాగతం

**ఆమనగల్లు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌కు ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగర్జన బహిరంగసభకు తరలివెళుతున్న కెటిఆర్‌కు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. తలకొండపల్లి మండల మాజీ జడ్పిటీసి కల్వకుర్తి నియోజకవర్గ కీలక నేత ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆమనగల్లుకు తరలివచ్చారు. కెటిఆర్ పట్టణంలో రాజీవ్ చౌరస్తా వద్దకు చేరుకోగానే వాహనం నుండి బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేయగా, ప్రజలు ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. అంతకు ముందు డిజె సౌండ్‌తో గులాబిపార్టీ పాటలకు శ్రేణులు డాన్స్‌లు చేస్తూ ఆకట్టుకున్నారు. బస్టాండ్ ప్రాంతానికి చేరుకోగానే అభి మానులు బాణాసంచాలు కాల్చి సందడి చేశారు. భారీగా తరలివచ్చిన అభిమానులు కెటిఆర్ కాన్వా య్‌ను అనుసరిస్తూ ముందుకు కదలింది. కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్, సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, పొనుగోటి అర్జున్‌రావు, పత్యనాయక్, నిర్మళశ్రీశైలంగౌడ్, నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఖలీల్, సోన శ్రీనునాయక్, టిప్పు సుల్తాన్, పంతునాయక్, దేరంగుల గణేశ్, దేరంగుల వెంకటేశ్ ఉన్నారు.



అభిమానులతో కరచాలనం చేస్తున్న
మాజీ మంత్రి కెటిఆర్

## జిల్లెడు చౌదరిగూడలో రాజుకున్న ఎన్నికల వేడి

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు, 28 ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన ఎన్నికల రిజర్వేషన్లను ప్రభుత్వం విడుదల చేయడంతో స్థానికంగా రాజకీయ వర్గాల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. ఈ వివరాలను సంబంధిత అధికారులు విడుదల చేశారు. మండలంలోని తొమ్మిది ఎంపిటిసి స్థానాల రిజర్వేషన్లు ఇలా ఇన్నాయి. మండలంలోని ఎదిర ఎస్‌టి, గుంజల్‌పహాడ్ ఎస్సీ, ఇందిరనగర్ ఎస్సీ మహిళ, తుమ్మలపల్లి బీసి, జిల్లెడు బీసి మహిళ, పద్మారం బిసి మహిళ, పెద్ద ఎల్కిచర్ల బిసి, వీరన్నపేట జనరల్ మహిళ, చేగిరెడ్డి ఘనాపూర్ జనరల్ స్థానాలుగా ఉన్నాయి. సర్పంచ్ రిజర్వేషన్లు ఇల్లా ఉన్నాయి. చేగిరెడ్డి ఘనాపూర్ బిసి జనరల్, చింతకుంటతాండ ఎస్‌టి మహిళ, చౌదరిగూడ జనరల్ మహిళ, ధర్మ్యాతాండ ఎస్‌టి జనరల్, ఎదిర బిసి మహిళ, ఎల్కగూడ బిసి జనరల్, గాలిగూడ జనరల్ మహిళ, గుంజల్‌పహాడ్ ఎస్సీ జనరల్, గుర్రంపల్లి ఎస్సీ జనరల్, ఇందిరనగర్ బిసి మహిళ, జాకారం జనరల్ జిల్లెడు బిసి మహిళ, కాస్లాబాద్ ఎస్‌టి జనరల్, లచ్చంపేట జనరల్, ముష్టిపల్లి బిసి జనరల్, పద్మారం బిసి జనరల్, పెద్ద ఎల్కిచర్ల ఎస్సీ మహిళ, పీర్జాపూర్ జనరల్, రావిర్యాల బిసి జనరల్, తూంపల్లి జనరల్, తుమ్మలపల్లి బీసి మహిళ, వాచ్యతాండ జనరల్ మహిళ, వనంపల్లి ఎస్సీ మహిళ, వీరన్నపేట జనరల్ మహిళ స్థానాలుగా ఉన్నాయి. ఎన్నికల రిజర్వేషన్లు విడుదల కావడంతో ఆయా గ్రామాలలో ఆశా వాదులు ఎన్నికలను సిద్ధం అవుతున్నారు.

**పూడూరు మండలంలో..**

**పూడూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలో 13 ఎంపిటిసి స్థానాలకుగాను ఆయా నియోజకవర్గాలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు శనివారం రాత్రి అధికారులు వెల్లడించారు. (1)ఎన్కెపల్లి జనరల్, (2)మన్నెగూడ బిసి జనరల్,(3)అంగడి చిట్టంపల్లి బిసి మహిళ, (4)చెన్‌గోముల్ బిసి జనరల్, (5)చీలాపూర్ ఎస్‌సి మహిళ,(6)పూడూరు జ బిసి మహిళ,(8)పెద్ద ఉమ్మెంతాల్ ఎస్‌సి జనరల్, (9)మేడిపల్లి కలాన్ ఎస్‌సి జనరల్,(10)కడ్మూరు బిసి జనరల్,(11)కంకల్ జనరల్ మహిళ, (12)మంచన్‌పల్లి బిసి మహిళ, (13)నిజాంపేట్ మేడిపల్లి జనరల్ మహిళగా రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పూడూరు జడ్పీటీసీగా ఎస్‌సి మహిళ, ఎంపిపిగా ఎస్‌సి మహిళకు కేటాయించినట్లు వివరించారు.

# ఆమనగల్లు ఈసారి జనరల్‌కే!

**ఎంపిపి, జడ్పీటీసి స్థానాలు ఒకే కేటగిరీకి ఖరారు**

**కొందరికి మోదం-మరికొందరికి ఖేదం మిగిల్చిన రిజర్వేషన్ల కోటా**

**వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న నేతలు**



ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

**ఆమనగల్లు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల వ్యవహారం కొందరికి మోదం.. మరికొందరికి ఖేదంగా మారింది. ఆయా స్థానాలపై ఆశలు పెట్టుకున్న నేతల అంచనాలు తల్లకిందులవడంతో ఎలాగైన అధికారం చేతిలో ఉంచుకోవటానికి వ్యూహాత్మకంగా పావులు కదపటానికి అనుచరులతో చర్చలు జరుపుతున్నారు. సామాజిక కోణంలో బిసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్‌తోపాటు మహిళలకు స్థానాలు కేటాయిసూ రిజర్వేషన్లను ప్రకటించారు. జిల్లా పరిషత్ సీఈఓ సారథ్యంలో అధికారులు రిజర్వేషన్ల కసరత్తు చేపట్టారు.

జిల్లా కలెక్టర్ జడ్పిటిసి, ఎంపిపి స్థానాల రిజర్వేషన్లు ఎస్టి, ఎస్సి, బిసి, జనరల్ రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లు లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేపట్టారు. ఈ వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లు ఎంపిపి, జడ్పీటీసితోపాటు 5 ఎంపిటీసిలు, 13 పంచాయతీ సర్పంచ్‌ల స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించారు. అందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఆమనగల్లు ఎంపిపి, జడ్పీటీసి స్థానాలు ఈసారి జనరల్ కోటాకు రిజర్వ్ చేశారు. ఆమనగల్లు మండల పరిషత్‌లో 5 ఎంపిటీసి నియోజకవర్గాలు కోనాపూర్, ఆకుతోటపల్లి, పోలెపల్లి, మేడిగడ్డ, మంగళపల్లి ఉన్నాయి. అలాగే 13 గ్రామపంచాయతీలు ఆకుతోట పల్లి, చెన్నం పల్లి, చింతలపల్లి, కోనాపూర్, కొత్తకుంటతండా, మంగళపల్లి, మేడిగడ్డ, పోలెపల్లి, రాంనుంతల, సీతారాంనగర్‌తండా, శెట్టిపల్లి, సింగంపల్లి, శంకర్‌కొండతండాలు ఉన్నాయి. 5 ఎంపిటీసి స్థానాలలో బీసీలకు2 (జనరల్1, మహిళ1) ఎస్టీలకు 2 (జనరల్1, మహిళ1) మరొక స్థానాన్ని అన్‌రిజర్వ్‌కు (జనరల్) కేటాయించారు. అలాగే మండల పరిధిలోని 13 పంచాయతీ సర్పంచ్‌ల పదవులకు బీసీలకు 5 స్థానాలు (3 జనలర్. 2 మహిళలు) 4 ఎస్టీలకు ( జనరల్ 2, మహిళలు 2) ఎస్సీలకు 3 (జనరల్ 2, మహిళ 1) మరొక స్థానం అన్‌రిజర్వ్ (జనరల్)కు కేటాయిం చారు. ఎంపీపీ, జడ్పిటిసి స్థానాలతోపాటు పంచాయతీ సర్పంచ్‌ల స్థానా లకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఇప్పుడు అందరి చూపు ఎన్నికల నోటిఫికేషన్ వైపు మళ్ళింది. రిజర్వేషన్‌ల కేటాయింపులు ఖరారు కావడం తో గ్రామాల్లో ఎన్నికల సెగలు రాజుకుంటున్నాయి.

**ఎంపిటిసి స్థానాలు ఇలా..**

ఆకుతోటపల్లి-బిసి (జనరల్), కోనాపూర్-బిసి (మహిళ), మంగళపల్లి-ఎస్టీ (మహిళ) మేడిగడ్డ-జనరల్, పోలెపల్లి (ఎస్టీ జనరలర్)

# చేవెళ్ల కోర్టులో ఫేక్ అర్డర్ కలకలం!

**బాధ్యులపై చర్యలకు**
**జిల్లా న్యాయస్థానం అదేశం**



చేవెళ్ల కోర్టు భవనం

**చేవెళ్ల, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** చేవెళ్ల కోర్టులో నకిలీ ఇంజక్షన్ అర్డర్ వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంపై సీరి యస్ అయిన జిల్లా న్యాయస్థానం బాధ్యులపై తక్షణ చర్యలకు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. ఐఎ నంబర్ 710/2024 ద్వారా ఒఎస్ నంబర్ 220/2024లో గత ఏడాది అక్టోబరు 1న నకిలీ ఇంజక్షన్ అర్డర్ జారీ చేశారని బార్ అసోసియేషన్ సభ్యురాలు పి.రోజారెడ్డి న్యాయమూర్తి ఫిర్యాదు చేశారు. నకిలీ ఆర్డర్ ప్రకారం..షాబాద్ తహసీల్దార్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలోని సర్వే నంబర్ 50లో 8.27 కుంటల విస్తీర్ణం గల భూమిని ధరణిలో బ్లాక్ చేయించారని కోర్టుకు వివరించారు. వాస్తవానికి ఐఎ నంబర్‌లో ఎలాంటి ఇంజక్షన్ ఆర్డర్ జారీ అవ్వలేదని రోజారెడ్డి పేర్కొంటూ నకిలీ పత్రాలను సృష్టించిన వ్యక్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

**కోర్టు ఫైళ్లు తారుమారు?**
**సిసి పుటేజీ విచారణలోనూ నిర్ధారణ**

మరోవైపు గతంలో ప్రముఖ న్యాయవాది ఒకరు ఓ సివిల్ దావాకు సంబంధించి బెంచ్ హాల్‌లో ఇష్టాను సారంగా తిరుగుతూ పలు వ్యాఖ్యలు చేశారని, ఒఎస్ నంబర్ 125/2020లో ఐఎ నంబర్ 417/2020లో మంజూరు చేసిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని పట్టు బట్టారని, మరో సీనియర్ న్యాయవాదితో వాగ్వివాదానికి దిగారని కోర్టు అధికారులు జిల్లా న్యాయ స్థానానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆవరణలో ఏమి జరుగుతోందని అసహనం వ్యక్తంచేసిన న్యాయమూర్తి దీనికి సంబంధించిన సిసి పుటేజిని పరిశీలించాలని కోర్టు సూపరిండెంట్‌ను అదేశించారు. దీంతో సిసి పుటేజీ పరిశీలించగా సదరు న్యాయవాది రికార్డుల గదిలోకి వెళ్లి ఫైల్స్‌ను చూస్తున్నట్లు చూసి తాను తెచ్చుకున్న డైరిలో నుండి కాపీలను ఫైల్‌లో పెడుతున్న దృశ్యం స్పష్టంగా కనిపించటంతో ఈ విషయాన్ని జిల్లా న్యాయ స్థానం దృష్టికి తీసుకెళ్లారు. చేవెళ్ల న్యాయ స్థానం ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన జిల్లా న్యాయ స్థానం ప్రాథమిక విచారణ చేసింది. తప్పు జరిగిందని స్పష్టమవడంతో నోటీలు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోర్టు అధికారులు అదేశించింది.

నకిలీ ఇంజక్షన్ అర్డర్ వ్యవ హారంలోనూ బాధ్యులపైన చర్యలు తీసు కోవాలని కోర్టు అధికారులకు జిల్లా న్యాయ స్థానం అదేశాలు జారీ చేసింది.

**న్యాయమూర్తిపైనే ఆరోపణలా!**

చేవెళ్ల కోర్టులో జరుగుతున్న అవకతవకలపై జిల్లా న్యాయ స్థానానికి ఫిర్యాదులు చేసినందుకు కొందరు న్యాయవాదులు న్యాయమూర్తిపై అసత్య అరోపణలు చేయటం తగదని బార్ అసోసియేషన్ వర్గాలు ఖండించాయి. ముక్కు సూటిగా పని చేస్తున్న న్యాయ మూర్తులపైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ ఇంజక్షన్ అర్డర్‌ను ఎవరు? ఎక్కడ తయారు చేశారన్న విషయాన్ని నిగ్గుతేల్చాలని కోరుతున్నారు. న్యాయ మూర్తికి తెలియకుండా న్యాయమూర్తి సంతం పోర్జరీ చేశారా? నకిలీ ఇంజక్షన్ అర్డర్‌పైన ఉన్న స్టాంపులు ఒరిజినలా? నకిలీవా? అనేది తేలాలని కోరారు.

# చరిత్రలో చిరస్థాయిగా నిలిచే పనులే చేస్తా

**చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మాలతీ కృష్ణారెడ్డి**



దుర్గా మాత భక్తుల కోసం షేడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న

**చేవెళ్ల, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ప్రజలకు నిత్యం ఉపయోగపడే పనులను, చరిత్రలో చిరస్థాయిగా నిలిచే పనులను మాత్రమే చేస్తామని చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ కృష్ణారెడ్డి అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన దుర్గామాత భక్తులకు నిలువ నీడ లేక పోవడంతో వర్షంలో తడుస్తూ భక్తులు పడుతున్న ఇబ్బందులను గ్రహించి స్వంత నిధులతో దుర్గా మాత భక్తులకు తల దాచుకునేందుకు పడుకు నేందుకు షేడ్ నిర్మాణంకు చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ కృష్ణారెడ్డి ముందుకు వచ్చారు. దుర్గామాత భక్తులకు నిర్మించే షేడ్‌కు ఆది వారం గ్రామస్తులతో భక్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భక్తులు సేద తీరేందుకు పెద్ద షేడ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చిరస్థాయిగా నిలిచే పనులు చేపట్టేందుకు ఎల్లప్పుడు ముందు ఉంటామన్నారు. ప్రజలు సమస్యలను తీర్చేందుకు ప్రజలకు అవసరమైన పనులు చేసేందుకు నిరంతరం పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ జెఎల్‌ఆర్, చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి బాల్‌రాజ్, చేవెళ్ల మాజీ ఎంపిటిసి గుండాల రాములు, గ్రామస్తులు బుడ్డన్నగారి జంగారెడ్డి, అర్ధ శేఖర్‌రెడ్డి, కనకమామిడి ఆనంతరెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, అల్లాడ వెంకట్‌రెడ్డి, నత్తి క్రిష్ణారెడ్డి, వడ్ల ఆనంద్, మంగలి యాదగిరి, కందవాడ మాణిక్యం, చాకలి క్రిష్ణా,బురాన్ విఠలయ్య, ప్రశాంత్, తలారి యాదయ్య, బిజెపి నాయకులు పాండురంగారెడ్డి, డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి,అత్తెల్లి అనంతరెడ్డి, గుడిపల్లి మధుసూదన్‌రెడ్డి, అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల హామీలు అమలు చేయాలి

**విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి**



నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం చేసిన దృశ్యం

**ఆమనగల్లు, సెప్టెంబర్28, ప్రభాతవార్త:** ఆమనగల్లు సెక్టార్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షునిగా నారోజు రామనాథం, ప్రధాన కార్యదర్శిగా నల్లజంగయ్యలు నూతనంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆమనగల్లు సెక్టార్ నూతన కార్యవర్గ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన నూతన కార్యవర్గ ఎంపికకు సెక్టార్ పరిధిలోని ఆమనగల్లు, మాడుగుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలి పెన్షన్‌దారులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పెన్షనర్ల ఎదుర్కుంటున్న సమస్యలపై చర్చించారు. ఇటీవల ప్రభుత్వము ఇచ్చిన హామీలన్నిటికీ తక్షణమే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేయడం చేశారు. రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన బకాయిలు, ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేయడం చేశారు. ఐదు విడతల కరువు బత్యాలను ప్రకటించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా నగదు రహిత హెల్త్ కార్డులు, నూతన వేతన సవరణలను వెంటనే అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చకుంటే త్వరలోనే కార్యాచరణతో ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఆమనగల్లు సెక్టార్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్టార్ సంఘం అధ్యక్షులుగా నారోజు రామనాథం, ప్రధాన కార్యదర్శిగా నల్ల జంగయ్య, ఆర్థిక కార్యదర్శిగా జిల్లెల సుదర్శన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా ఎంగలి బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి వెంకట్ రెడ్డి,టి. సుజాత, సంయుక్త కార్యదర్శిగా టి. నారాయణగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లట్టుపల్లి హరికిషన్‌రెడ్డి ప్రచార కార్యదర్శిగా సి.శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కౌనిలర్స్‌గా కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, గుర్రం భద్రయ్య, ఎల్.నర్సి రెడ్డి, టీ విద్యాధర్, మహాలింగం, ఆంజనేయులు ఎన్నుకున్నారు.

# పాలమాకుల పోరాటాలు స్ఫూర్తిదాయకం



సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా నియమితమైన
జంగయ్యను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

**షాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పాలమాకుల జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు షాబాద్ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం తెలిపారు. శనివారం ఆయన షాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని చండీగర్ పట్టణ కేంద్రంలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ 25వ జాతీయ వసభలలో సిపిఐ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాలమాకుల జంగయ్య ఎన్నికయ్యారని తెలిపారు. ప్రస్తుతం సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఆయన పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు, రాజీలేనిపోరాటాలు నిర్వహించి బడుగు బలహీన వర్గాల కోసం అలుపెరుగకుండా అహర్నిశలు శ్రమిస్తూ అందరి మన్ననలు పొందిన వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు. రాష్ట్ర పార్టీ ఏ పిలుపును ఇచ్చినా జిల్లాలో అందరి నాయకత్వాన్ని ఏకంచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆయన కృషి ఎంతగానో ఉందన్నారు. జిల్లాలో విద్యార్థి, యువజన, మహిళ లాంటి ప్రజా సంఘాలను బలోపేతం చేయడంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారని, అలాంటి వ్యక్తికి పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడుగా నియమించడం హర్షదయాకమన్నారు. ప్రజలతో మమేకమవుతూ పార్టీలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాం, నారాయణ, మధు కుమార్, తదితరులు ఉన్నారు.



బిక్షపతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

## బిక్షపతికి విద్యారత్న పురస్కారం

**మంచాల సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ విద్యారత్న పురస్కారం అందుకున్న డాక్టర్ ఎస్.కే బిక్షపతి దంపతులను ఆదివారం మండల అధ్యక్షులు కొత్తూరు శేఖరప్ప శాలువా, పూలమాలల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం మంచాల మండల అధ్యక్షుడు కొత్తూరు శేఖరప్ప, ప్రధాన కార్యదర్శి జక్క హరీష్ ఆధ్వర్యంలో జరిగింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో, విద్యారంగానికి చేసిన కృషి కి గాను డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళ్ల శస్త్ర చికిత్స చేయించుకున్న వాళ్లకు కళ్లద్దాలు అందించారు. ఈ సందర్భంగా వి.ఆర్.వన్ ట్రస్ట్ చైర్మన్ కుకుడాల వెంకటేశ్వర్ రెడ్డి, జన సందేశ్ ఫౌండేషన్ చైర్మన్ జి లచ్చి రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.వెంకట రెడ్డి , జక్క నాగభూషణ్, జక్క పరమేష్ వెంబడి ఈశ్వరప్ప బకున రాజప్ప, ఏ నూతల రాజు, బిర్యాని సతీష్, బకున రాజేశ్వర్, జక్క పెంటప్ప, కడియాల పరమేశ్వరి, అక్షిత, నరసింహారెడ్డి, బాలరాజు, జక్క చంద్రశేఖర్, నూకం రాజు, గాండాల జంగయ్య, కృష్ణ, రాజేందర్ రెడ్డి, సత్య గౌడ్, మారగోని శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో వీధి దీపాలు



వీధి దీపాలు ఏర్పాటు
చేసిన దృశ్యం

**కేశంపేట, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో వీధి దీపాలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను చూసి చెల్లించిన పల్లె బ్రదర్స్ తమ సొంత నిధులతో గ్రామంలోని ముఖ్య కూడలి అయిన గాంధీ స్టాచ్,అంబేద్కర్ స్టాచ్ లలో ఎల్ఈడి లైట్స్ ను వేయించారు. పుట్టి పెరిగిన గ్రామానికి తమ సొంత నిధులతో వీధి దీపాలను ఏర్పాటు చేయించిన పల్లె బ్రదర్స్ లను గ్రామస్తులు అభినందించారు.



పితృవియోగం పొందిన జహంగీర్‌ను
పరామర్శిస్తున్న హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డి

## బిఆర్ఎస్ నేత జహంగీర్‌కు హరీశ్‌రావు పరామర్శ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్ తండ్రి ఎండి ఖాసీం ఇటీవల మృతిచెందటంతో ఆయనను (పిత్రు వియోగంతో) మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు తుర్కపల్లికి వచ్చి పరామర్శించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుబూతిని తెలియజేశారు. ఆదివారం రాత్రి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఎండి ఖాసీం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్‌ను, బిఆర్ఎస్ నాయకులు ఎండి యూసుఫ్‌బాబను ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఓదార్చి వారికి సాను భూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర అటవీ సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, ఎండి అన్వర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

**టిపిసిసి మైనార్టీ సెల్ నేత అశ్వక్ అలీ**

**షాబాద్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** తమ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి కష్టపడి చదివి ఉద్యోగాలకు పోటీపడుతున్న విద్యార్థులను కించపరిచే విధంగా మాట్లాడిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విద్యార్థులకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం విలేక రులతో మాట్లాడుతూ.. గ్రూప్ వన్ అభ్యర్థుల పై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని, వాటిని వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ తరపున న్యాయస్థానానికి వెళ్తామని హెచ్చరించారు.

## మట్టిలో మాణిక్యం

**పేదింటి అమ్మాయికి ఉన్నత ఉద్యోగం**

**యాచారం, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** యాచారం మండలం నంది వనపర్తి అనుబంధ గ్రామమైన పిల్లి పెల్లి గ్రామానికి చెందిన అయ్యగాని శోభ పాండు దంపతుల కుమార్తె ప్రవళికకు గ్రూప్ 2 ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం సాధించారు. నిరుపేద కుటుంబం నుండి యాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకూ చదివి, ప్రైవేటు పాఠశాలలో ఇంటర్ పూర్తి చేసుకొని, ఫార్మసీ అనంతరం 2022 లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి, ఉద్యోగ నిర్వర్తిస్తూనే ఎక్సైజ్ ఎస్సైగా గ్రూప్ 2 ఉద్యోగం సాధించారు. నిరుపేద కుటుంబం నుండి మారు మూల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని ఉన్నతమైన ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలనే భేదం లేకుండా చిత్తశుద్ధితో చదువుకొని సంకల్పంతో ఉద్యోగం సాధించారని పలువురు హర్షం వ్యక్తం చేశారు.